



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

సోమవారం,
జూన్ 8, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




## ఉక్కు కొలిమిలో మృత్యు తాండవం

**విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో విషాదకర ఘటన.. లాడిల్ పేలుడుతో కార్మికులపై ఉక్కు ద్రావణం**

**ఎనిమిది మంది అక్కడికక్కడే మృతి.. ఆరుగురికి తీవ్ర గాయాలు**

**1,540 డిగ్రీల వేడితో సలసల మరిగిన ద్రవ ఉక్కు ధాటికి విషాదం**

**స్టీల్ మెల్ట్ షాప్--1లో నాలుగు గంటలపాటు మంటలతో పోరాటం**

**పరిహారం ప్రకటించే వరకు మృతదేహాలు తరలించనివ్వమన్న కుటుంబ సభ్యులు**

విశాఖపట్నం : విశాఖ ఉక్కు కర్మాగారంలో సోమవారం సాయంత్రం సంభవించిన ఘోర ప్రమాదం ఎనిమిది మంది కార్మికుల ప్రాణాలను బలిగొంది. ఉక్కు తయారీ ప్రక్రియలో కీలకమైన స్టీల్ మెల్ట్ షాప్--1 విభాగంలో లాడిల్ ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలిపోవడంతో సుమారు 150 టన్నుల ద్రవ ఉక్కు లావాలా ఎగసిపడి విధుల్లో ఉన్న కార్మికులపై పడింది. 1,540 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతతో ఉన్న ద్రవ ఉక్కు ధాటికి ఎనిమిది మంది కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అన్నం పెట్టే ఉద్యోగమే వారికి మృత్యుపాశంగా మారింది. నిత్యం ఉక్కుతో పని చేస్తూ ప్రమాదాల మధ్య జీవించే

(మిగతా 2వ పేజీలో)

# గుజరాత్ గులామీ కాదు.. తెలంగాణ అభివృద్ధే ముఖ్యం

**రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన అనుమతులు, నిధుల కోసం కేంద్రంపై పోరాడాలని బీజేపీ ఎంపీలకు సీఎం రేవంత్ పిలుపు**



**మోదీ పేరుతో ఓట్లు అడిగే నేతలు స్థానిక సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచన**

**మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, ఆర్ఆర్ఆర్ వంటి కీలక ప్రాజెక్టులకు సహకరించాలని విజ్ఞప్తి**

**అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలే తగిన తీర్పు ఇస్తారని హెచ్చరిక**

**వివక్ష, వితండవాదాలకు తావులేకుండా నగరాభివృద్ధికి అన్ని పక్షాలు కలసిరావాలని పిలుపు**

**లక్ష ఇళ్ల నిర్మాణం, మహిళా సాధికారత, యువత భవిష్యత్తుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి**

**1,675 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

హైదరాబాద్, జూన్ 8: రాష్ట్ర ప్రజల అవసరాలు, హైదరాబాద్ భవిష్యత్ అభివృద్ధి దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు, నిధులు తీసుకురావడంలో తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు చొరవ చూపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. రాష్ట్రం నుంచి గెలిచిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు కేంద్ర ప్రభుత్వంలో ప్రభావవంతమైన స్థానాల్లో ఉన్నప్పటికీ తెలంగాణ ప్రయోజనాల కోసం గట్టిగా నిలబడటం లేదని ఆయన విమర్శించారు. సబర్మతి రివర్‌ఫ్రంట్ వంటి ప్రాజెక్టులను ప్రశంసించే వారు, హైదరాబాద్‌కు అత్యంత అవసరమైన మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. మియాపూర్‌లో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం సహా దాదాపు రూ.1,675 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన అనంతరం

(మిగతా 2వ పేజీలో)




## ప్రతిపక్ష ఐక్యతే భాజపాకు ప్రత్యామ్నాయం

**అంతర్గత విభేదాలు పక్కనపెట్టి ఉమ్మడి పోరాటానికి ఇండియా కూటమి పిలుపు**

**కలిసి నిలిస్తేనే కేంద్ర ప్రభుత్వాన్ని ఎదుర్కోగలమని రాహుల్‌గాంధీ వ్యాఖ్య**

**రెండు నెలలకోసారి సమావేశాలతో వ్యూహానికి పదును పెట్టాలని నిర్ణయం**

**వచ్చే సమావేశానికి హైదరాబాద్ ఎంపిక**

**ఓటరు జాబితాలు, నీట్ వివాదం, నిరుద్యోగం వంటి అంశాలపై ఉమ్మడి కార్యాచరణ**

న్యూఢిల్లీ: కేంద్రంలోని భాజపా ప్రభుత్వాన్ని సమర్థంగా ఎదుర్కోవాలంటే ప్రతిపక్షాలు పరస్పర విభేదాలను పక్కనపెట్టి ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఇండియా కూటమి నాయకులు అభిప్రాయపడ్డారు. దేశ రాజకీయాల్లో వేగంగా మారుతున్న పరిణామాలు, వివిధ రాష్ట్రాల్లో ప్రతిపక్షాలకు ఎదురవుతున్న సవాళ్ల నేపథ్యంలో సోమవారం ఢిల్లీలో జరిగిన ఇండియా కూటమి సమావేశం ఈ దిశగా కీలక సంకేతాలను ఇచ్చింది. సమావేశంలో పాల్గొన్న లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, "కలిసి ఉంటే నిలబడతాం.. కలహించుకుంటే పడిపోతాం" అంటూ కూటమి భాగస్వామ్య పక్షాలకు పిలుపునిచ్చారు. ప్రధాన ప్రత్యర్థి భాజపా అని గుర్తుంచుకుని

(మిగతా 2వ పేజీలో)

# ఖనిజ సంపదతో దేశ భవిష్యత్తుకు కొత్త దిశ

**క్రిటికల్ మినరల్స్‌పై దేశవ్యాప్త కార్యాచరణకు కేంద్రం సిద్ధం**

**బొగ్గు, గనుల రంగాల్లో భారీ సంస్కరణలు చేపట్టిన మోదీ ప్రభుత్వం**

**2028లో తెలంగాణలో భాజపా అధికారంలోకి వస్తుందని కిషన్‌రెడ్డి ధీమా**

**సింగరేణి ఉద్యోగుల ఆదాయపు పన్ను రీయింబర్స్ చేస్తామని హామీ**

**డీఎంఎఫ్ నిధుల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శలు**

**కోల్ గ్యాసిఫికేషన్, ఖనిజ ప్రాసెసింగ్ పార్కులతో భారీ పెట్టుబడుల లక్ష్యం**

**ధాన్యం కొనుగోళ్లు, రైతు బోనస్‌లపై కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు**



హైదరాబాద్: ఎలక్ట్రిక్ వాహనాలు, సెమీకండక్టర్లు, రక్షణ రంగం వంటి భవిష్యత్ పారిశ్రామిక వ్యవస్థలు క్రిటికల్ మినరల్స్‌పైనే ఆధారపడి ఉన్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశ భద్రత, పారిశ్రామిక అభివృద్ధి, సాంకేతిక స్వావలంబన లక్ష్యంగా మోదీ ప్రభుత్వం ఖనిజ రంగంలో సమగ్ర కార్యాచరణ అమలు చేస్తోందని తెలిపారు. క్రిటికల్ మినరల్స్ నుంచి కోల్ గ్యాసిఫికేషన్ వరకు విస్తరించిన ప్రణాళికల ద్వారా భారత్‌ను 'మినరల్ పవర్'గా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బొగ్గు, గనుల శాఖ 2014 తర్వాత సాధించిన విజయాలు, తీసుకొచ్చిన సంస్కరణలను వివరించారు. మైనింగ్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి కోసం వినియోగించాల్సిన డీఎంఎఫ్ నిధులను గత భారాస ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం

(మిగతా 2వ పేజీలో)



## పెళ్లి జరగకపోతే ప్రేమ మోసమా?

**వివాహం కాకపోయినంత మాత్రాన మోసం కాదన్న సుప్రీంకోర్టు**

**పరస్పర అంగీకార బంధాన్ని నేరంగా చూడొద్దని వ్యాఖ్య**

**ఒక్క కేసుతో వ్యక్తి నైతికతను అంచనా వేయలేం: ధర్మాసనం**

**తెలంగాణ కానిస్టేబుల్ అభ్యర్థికి ఊరటనిచ్చిన తీర్పు**

**సాక్ష్యాలు లేకుండా ఉద్యోగం నిరాకరించడం సరికాదు**

**మారుతున్న సామాజిక పరిస్థితులను గుర్తించాలని సూచన**

న్యూఢిల్లీ: ఇద్దరు అవివాహిత వయోజనుల మధ్య పరస్పర అంగీకారంతో కొనసాగిన సంబంధం చివరకు వివాహానికి దారి తీయకపోయినంత మాత్రాన దానిని మోసంగా పరిగణించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలాంటి సంబంధాల ఆధారంగా ఒక వ్యక్తి నైతిక ప్రవర్తనను చెడుగా అంచనా వేయడం లేదా ఉద్యోగ అవకాశాలను నిరాకరించడం సరైన విధానం కాదని పేర్కొంది. సమాజంలో మారుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు మరింత సున్నితంగా వ్యవహరించాలని సూచించింది. తెలంగాణ పోలీసు శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన గాజుల తిరుపతి అనే అభ్యర్థికి సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం పెట్టుకుని తర్వాత మోసం చేశాడనే ఆరోపణలతో గతంలో నమోదైన కేసును ఆధారంగా తీసుకుని తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు అతనికి ఉద్యోగం నిరాకరించింది. ఆ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ అభ్యర్థి న్యాయపోరాటం సాగించాడు. 2018లో తెలంగాణ పోలీస్ కానిస్టేబుల్ నియామక పరీక్షల్లో ప్రాథమికంగా ఎంపికైన అభ్యర్థి నేపథ్య పరిశీలన సమయంలో ఈ అంశం వెలుగులోకి వచ్చింది. అయితే సంబంధిత కేసులో లోక్‌అదాలత్ ద్వారా రాజీ కుదిరి తాను నిర్దోషిగా బయటపడ్డానని అభ్యర్థి పేర్కొన్నప్పటికీ, నైతిక విలువలకు సంబంధించిన వివాదంలో ఇరుక్కున్నాడనే కారణంతో నియామక ప్రక్రియను నిలిపివేశారు.

# గుజరాత్ గులామీ కాదు.. తెలంగాణ అభివృద్ధే ముఖ్యం



ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. నగర తాగునీటి అవసరాల కోసం గోదావరి, సింగూరు జలాల వినియోగం, రెండో దశ మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్‌రోడ్, మూసీ పునరుజ్జీవన కార్యక్రమాలకు కేంద్ర అనుమతులు, ఆర్థిక సహకారం అత్యవసరమని పేర్కొన్నారు. ఈ అంశాలపై తెలంగాణ ఎంపీలు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు స్థానికంగా అందుబాటులో ఉండే నాయకత్వం అవసరమని సీఎం వ్యాఖ్యానించారు. మున్సిపల్ వార్డు ఎన్నికల నుంచి ప్రతి ఎన్నికలోనూ జాతీయ నాయకుల పేర్లు చెప్పి ఓట్లు అడగడం కంటే, స్థానిక సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసే ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని సూచించారు. మోరీలోని మురుగు తొలగించడానికి, కాలనీల్లో రోడ్లు వేయించడానికి, తాగునీరు అందించడానికి ఢిల్లీ నుంచి నాయకులు రారని, స్థానికంగా పని చేసే నాయకులే ప్రజలకు ఉపయోగపడతారని చెప్పారు. తన పాలనపై విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలకు కూడా సీఎం సవాల్ విసిరారు. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం, గత పన్నెండేళ్లలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను వివరించడానికి సిద్ధమైతే, తాను గత రెండేళ్లలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజల ముందుంచేందుకు సిద్ధమని తెలిపారు. ఈ అంశంపై అసెంబ్లీలో విస్తృత చర్చ జరపడానికి కూడా తాము సిద్ధమని పేర్కొన్నారు. హైదరాబాద్ అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు సహకరించాలని సీఎం పిలుపునిచ్చారు. ఎన్నికల సమయం వచ్చినప్పుడు రాజకీయ పోటీలు కొనసాగించవచ్చని, కానీ అప్పటివరకు నగరాభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. విలువైన సూచనలు ఇవ్వకుండా అబద్ధాలు, ఆరోపణలతో అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారికి భవిష్యత్తులో తగిన రాజకీయ సమాధానం ఇస్తారని హెచ్చరించారు. తాను ఢిల్లీ వెళ్లి ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసిన ప్రతిసారీ రాష్ట్రానికి అవసరమైన అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నానని సీఎం తెలిపారు. అయితే ఆ తర్వాత కొందరు నేతలు కేంద్ర స్థాయిలో అభివృద్ధి ప్రతిపాదనలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. హైదరాబాద్ భవిష్యత్తు కోసం ప్రతిపాదించిన ప్రాజెక్టులు వ్యక్తిగతంగా ఎవరికో పేరు రావడానికి కాదని, కోట్లాది ప్రజల ప్రయోజనాల కోసం అని పేర్కొన్నారు. దేశంలోని ప్రధాన నగరాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఉదాహరణగా చూపుతూ హైదరాబాద్‌ను ముందుగానే ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీలో కాలుష్యం, ముంబైలో వరదలు, ట్రాఫిక్, బెంగళూరులో రవాణా సమస్యలు, చెన్నైలో వర్షాకాల ఇబ్బందులు, కోల్‌కతాలో శాంతిభద్రతల సమస్యలు ఉన్నాయని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌కు రాకుండా ముందస్తు చర్యలలో భాగంగానే మూడు కార్పొరేషన్ల ఏర్పాటు వంటి నిర్ణయాలు తీసుకున్నామని వివరించారు.

మహిళా సాధికారత ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలలో ఒకటని సీఎం స్పష్టం చేశారు. కోటి మంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి నుంచి పెట్రోల్ బంకుల నిర్వహణ వరకు మహిళలు ముందుకు వస్తున్నారని చెప్పారు. అమెజాన్ వంటి వేదికల ద్వారా మహిళా సంఘాల ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఆడబిడ్డలకు ప్రాధాన్యతతో పాటు నిరుద్యోగ యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, స్పోర్ట్స్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

హైదరాబాద్ నగరంలో పేదల కోసం లక్ష ఎల్ఐజీ, ఎంఐజీ గృహాల నిర్మాణం చేపట్టనున్నట్లు సీఎం తెలిపారు. పెరుగుతున్న నగర జనాభా అవసరాలకు అనుగుణంగా గృహ వసతి కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం గాజులరామారంలో వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో బస్ టెర్మినల్ నిర్మాణానికి త్వరలో శ్రీకారం చుడతామని వెల్లడించారు.

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సైతం ఆధునిక ఐటీ కార్పొరేట్ సంస్థల స్థాయిలో నెట్‌జీరో ప్రమాణాలతో నిర్మించనున్నట్లు సీఎం తెలిపారు. నగరాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఆధునిక మౌలిక వసతుల కల్పనలను సమన్వయం చేస్తూ హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ శేరిలింగంపల్లి ప్రాంతంలో ఇప్పటికే 1,500కుపైగా ఐటీ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, సుమారు పది లక్షల మంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. వారి అవసరాలకు అనుగుణంగా రవాణా, రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు.

ఈ సందర్భంగా సీఎంసీ, హెచ్ఎండీఏ, విద్యాశాఖ, ఆర్అండ్‌బీ శాఖల ఆధ్వర్యంలో చేపట్టనున్న మొత్తం 11 అభివృద్ధి ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. సీఎంసీ ప్రధాన కార్యాలయం, మియాపూర్ ఫ్లైఓవర్, శేరిలింగంపల్లి ఆర్వోబీ, ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్లు, పలు అనుసంధాన రహదారులు, విద్యా మౌలిక వసతుల ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్‌తో తయారు చేసిన శాలువా, బొకేతో సీఎంను సత్కరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాష్ట్ర అభివృద్ధి, నగర విస్తరణ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని చేపడుతున్న ఈ కార్యక్రమాలకు ప్రజల సహకారం అవసరమని సీఎం పునరుద్ఘాటించారు.

# ఉక్కు కొలిమిలో మృత్యు తాండవం

ఆ కార్మికులు, అదే ఉక్కు ద్రావణానికి బలైపోయారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులమని గర్వంగా చెప్పుకునే వారు చివరికి ఉక్కు కొలిమిలోనే ప్రాణాలు విడవడం అందరినీ కలచివేసింది. ప్లాంట్‌లోని స్టీల్ మెల్ట్ షాప్--1లో బ్లాస్ట్ ఫర్నేస్ నుంచి టర్బో లాడిల్ ద్వారా కన్వర్టర్‌కు ద్రవ ఉక్కును తరలిస్తారు. అక్కడ మిశ్రమాలు కలిపిన అనంతరం మరో లాడిల్ ద్వారా క్యాస్టింగ్ మిషన్లకు పంపిస్తారు. ఈ విభాగంలో మొత్తం ఆరు క్యాస్టింగ్ మిషన్లు పనిచేస్తుంటాయి. అనంతరం కంటిన్యూయస్ క్యాస్టింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఉక్కును బ్లూమ్స్‌గా మారుస్తారు. సోమవారం సాయంత్రం సుమారు 4.20 గంటల సమయంలో కన్వర్టర్ నుంచి బయలుదేరిన లాడిల్--19ను క్యాస్టింగ్ మిషన్--2లోకి పంపే ప్రక్రియ కొనసాగుతుండగా అకస్మాత్తుగా భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడుతో లాడిల్‌లో ఉన్న ద్రవ ఉక్కు ఒక్కసారిగా పైకి ఎగసి పరిసర ప్రాంతాల్లో చెలరేగింది. విధుల్లో ఉన్న కార్మికులు తప్పించుకునేలోపే ఉక్కు ద్రావణం వారిపై పడింది. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ సుమారు 14 మంది శాశ్వత, ఒప్పంద కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం. వారిలో ఎనిమిది మంది ద్రవ ఉక్కు నేరుగా తాకడంతో తీవ్రంగా కాలిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన ఆరుగురు గాయాలతో బయటపడినా వారి పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది.

ప్రమాదం జరిగిన వెంటనే కర్మాగారం అంతటా కలకలం రేగింది. భారీ మంటలు వ్యాపించడంతో ఉక్కు కర్మాగారానికి చెందిన సీఐఎస్ఎఫ్ అగ్నిమాపక సిబ్బంది అత్యవసరంగా రంగంలోకి దిగారు. ఆరు అగ్నిమాపక వాహనాలతో సుమారు నాలుగు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. అనంతరం సహాయక చర్యలు చేపట్టి గాయపడిన వారిని ఉక్కు జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు.

ప్రమాదం ఎలా జరిగిందనే అంశంపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. లాడిల్‌లో సాంకేతిక లోపమా, నిర్వహణలో నిర్లక్ష్యమా, లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణాల్లో పరిశీలిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన లాడిల్‌ను నిపుణుల బృందం సవివరంగా పరిశీలిస్తోంది.

మృతుల కుటుంబ సభ్యులు, కార్మిక సంఘాలు ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఉక్కు యాజమాన్యం తరఫున ప్రతినిధులు నష్టపరిహారం ప్రకటిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, అధికారికంగా స్పష్టమైన ప్రకటన వచ్చే వరకు మృతదేహాలను పోస్టుమార్టం కోసం తరలించేందుకు వారు నిరాకరించారు. ఉక్కు జనరల్ ఆసుపత్రి మార్చురీ వద్ద అంబులెన్స్‌లను అడ్డుకుని నిరసన తెలిపారు. మృతుల కుటుంబాలకు తగిన పరిహారం, కుటుంబ సభ్యులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఘటన సమాచారం అందుకున్న రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

దేశంలో ప్రముఖ ఉక్కు ఉత్పత్తి కేంద్రంగా పేరొందిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో చోటుచేసుకున్న ఈ ప్రమాదం పరిశ్రమ వర్గాలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఉక్కు పరిశ్రమ చరిత్రలోనే అత్యంత విషాదకర ఘటనల్లో ఒకటిగా ఇది నిలిచిపోయింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన నేపథ్యంలో కార్మిక కుటుంబాలు, సహోద్యోగులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

### తెలంగాణలోకి ప్రవేశించిన
## నైరుతి రుతుపవనాలు..
### పలు జిల్లాలకు వర్ష సూచన

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు సోమవారం ప్రవేశించాయి. నారాయణపేట, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల మీదుగా ఇవి రాష్ట్రంలోకి ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ అధికారికంగా ప్రకటించింది. దీంతో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న వేసవి తాపం నుంచి ప్రజలకు ఉపశమనం లభించనుంది. ఈ నెల 4వ తేదీన కేరళను తాకిన రుతుపవనాలు క్రమంగా కదులుతూ కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలను దాటి తెలంగాణలోకి ప్రవేశించాయి. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో రానున్న రెండు, మూడు రోజుల్లో తెలంగాణలోని మరిన్ని ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాలకు ఇవి విస్తరిస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనాల ప్రకారం, జూన్ 11–12 తేదీల మధ్య రుతుపవనాలు గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతాన్ని తాకే అవకాశం ఉంది. జూన్ 15 నుంచి 18వ తేదీలోగా రాష్ట్రంలోని మధ్య, ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఇవి పూర్తిగా విస్తరిస్తాయని భావిస్తున్నారు. మరోవైపు, రుతుపవనాల రాకతో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. జూన్ 8, 9 తేదీల్లో వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయడంతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడొచ్చని సూచించింది. రుతుపవనాల ఆగమనంతో రైతులు ఖరీఫ్ సాగు పనులకు సిద్ధమవుతున్నారు.

## ప్రతిపక్ష ఐక్యతే భాజపాకు ప్రత్యామ్నాయం

అన్ని రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. కూటమిలో భాగమైన కొన్ని పార్టీలు తరచూ కాంగ్రెస్‌పై విమర్శలు చేయడాన్ని ప్రస్తావిస్తూ, అలాంటి ధోరణి ప్రతిపక్షాల ఉమ్మడి లక్ష్యాలకు భంగం కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. ఓటరు జాబితాల్లో అక్రమాలు, ఓటు హక్కుల పరిరక్షణ వంటి కీలక అంశాలపై కూడా అన్ని పార్టీలు మరింత చురుకుగా స్పందించాలని కోరారు. సమావేశాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దేశం ఎదుర్కొంటున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక సవాళ్లపై ప్రతిపక్షాలు మరింత బలంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు సంబంధించిన అంశాలను ముందుకు తెచ్చి కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కేంద్ర ప్రభుత్వంపై ఉమ్మడి పోరాటానికి ఐదు ప్రధాన అంశాలను గుర్తిస్తూ కార్యాచరణ రూపొందించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటరు జాబితాలపై సందేహాలు, నీట్ మరియు ఇతర పరీక్షల నిర్వహణలో తలెత్తిన వివాదాలు, పెరుగుతున్న నిరుద్యోగం, ధరల భారం, రైతు సమస్యలు, వివిధ రాష్ట్రాల్లో ప్రజాస్వామ్య హక్కులపై జరుగుతున్న దాడులు వంటి అంశాలపై సంయుక్తంగా ఉద్యమించాలని నిర్ణయించారు. ఇకపై ప్రతి రెండు నెలలకోసారి కూటమి సమావేశం నిర్వహించాలని నేతలు అంగీకరించారు. తదుపరి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలనే ప్రతిపాదనకు కూడా ఆమోదం లభించింది. వివిధ రాష్ట్రాల్లో సమావేశాలు నిర్వహించడం ద్వారా స్థానిక స్థాయిలో ప్రతిపక్ష శక్తులను మరింత చైతన్యపరచవచ్చని నేతలు అభిప్రాయపడ్డారు. ఇటీవల కొన్ని రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీలకు ఎదురైన ఎన్నికల పరాజయాలు, మారుతున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కూటమి భాగస్వామ్య పక్షాలన్నీ సమావేశానికి ప్రాధాన్యత ఇచ్చాయి. మొత్తం 23 రాజకీయ పార్టీలకు చెందిన 35 మంది నాయకులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. సమావేశం సందర్భంగా పలువురు నేతలు పరస్పరం చర్చలు జరిపి భవిష్యత్ వ్యూహాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. కేరళ రాజకీయాల నేపథ్యంలో కాంగ్రెస్ మరియు వామపక్ష పార్టీల మధ్య నెలకొన్న విభేదాల అంశం కూడా సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. కొన్ని రాష్ట్రాల్లో పరస్పర విమర్శలు కూటమి ఐక్యతకు ఆటంకం కలిగిస్తున్నాయని కొందరు నేతలు అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ జాతీయ స్థాయిలో భాజపాను ఎదుర్కోవడమే ప్రధాన లక్ష్యమని సమావేశం స్పష్టం చేసింది. సమావేశం అనంతరం విడుదల చేసిన తీర్మానాల్లో ఓటరు జాబితాల అంశంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయాలని నిర్ణయించారు. అలాగే నీట్, సీబీఎస్ఈ పరీక్షల నిర్వహణపై తలెత్తిన వివాదాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశ ఆర్థిక పరిస్థితి, నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల సమస్యలు వంటి అంశాలపై కేంద్రం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కోరారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనూ ప్రతిపక్షాలన్నీ సమన్వయంతో వ్యవహరించాలని, ప్రతిరోజూ వ్యూహాత్మక చర్చలు జరుపుతూ ఉమ్మడి స్వరంతో ముందుకు సాగాలని నిర్ణయించారు. రాబోయే కాలంలో ప్రతిపక్ష ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ కేంద్ర ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి పెంచడమే ఇండియా కూటమి ప్రధాన లక్ష్యమని సమావేశం స్పష్టం చేసింది.



## డాక్టరేట్ పొందిన సామాజికవేత్త, డా, కపిల్ కుమార్ అగర్వాల్ సన్మానించిన- సీనియర్ పాత్రికేయులు
### కపిల్ కుమార్ అగర్వాల్‌కు డాక్టరేట్ లభించడం హర్షణీయం: గణేష్ సాగర్

వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో : కృష్ణ గోపాల్ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు కపిల్ కుమార్ అగర్వాల్ కు డేస్ స్ప్రింగ్ టెక్నాలజికల్ యూనివర్సిటీ, జై భీమ్ యూనిటీ ఫౌండేషన్ వారిచే గౌరవ డాక్టరేట్ పొందిన సందర్భంగా డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్ ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, వారిని ఘనంగా సన్మానించిన సీనియర్ పాత్రికేయులు, వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో గణేష్ సాగర్, ఎల్ బి నగర్ క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఏలే భాస్కర్, ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా కృష్ణ గోపాల్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు గౌరవ డాక్టరేట్ పొందడం హర్షణీయమని అన్నారు, స్వయంకృషితో మానవసేవే.. మాధవ సేవగా భావించి అనాధలకు, వృద్ధులకు, నిరుపేదలకు, అనాధ పాఠశాల విద్యార్థులకు వీరు చేస్తున్న సేవలకు అవార్డులు అవే వారి గుమ్మం ముందు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవా సమితి సభ్యులు పాక సతీష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు

## ఫడ్నవీస్ అపాయింట్‌మెంట్‌పై రేవంత్ అబద్ధం చెబుతున్నారు: బీజేపీ




హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి కూడా అసత్య ప్రచారాలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రంగా ఆరోపించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిసేందుకు ప్రయత్నించానని రేవంత్ రెడ్డి చెప్పడం పూర్తిగా అవాస్తవమని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడుతూ, ఫడ్నవీస్‌తో భేటీ కోసం రేవంత్ రెడ్డి ఎలాంటి అపాయింట్‌మెంట్ కోరలేదని, ఈ విషయాన్ని ఫడ్నవీస్ కార్యాలయమే స్పష్టం చేసిందని తెలిపారు. నెల రోజుల క్రితం ఒక మంత్రి (ఉత్తమ్) అపాయింట్‌మెంట్ కోరారని, కానీ ఇప్పుడు ముఖ్యమంత్రే స్వయంగా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర, దక్షిణ భారతదేశం మధ్య విభజన రాజకీయాలకు పాల్పడుతోందని రాంచందర్ రావు విమర్శించారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ సాధిస్తున్న పురోగతిని కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేకపోతోందని ఆయన వ్యాఖ్యానించారు. అభివృద్ధి పథకాలను కాంగ్రెస్ నేతలు స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా మూసీ నది ప్రక్షాళన, కాళేశ్వరం ప్రాజెక్టు వంటి అంశాలను కూడా ఆయన ప్రస్తావించారు. మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు వల్ల ప్రభావితమయ్యే బాధితులకు పునరావాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య రాజకీయ పోరు తీవ్రతరమైన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## ఎబోలాపై తెలంగాణ ప్రభుత్వం పూర్తి అప్రమత్తం: శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో నిఘా కట్టుదిట్టం!

**ఎబోలాపై దామోదర్ రాజనర్సింహ సమీక్ష**

**విమానాశ్రయంలో స్క్రీనింగ్, సర్విలెన్స్‌ను కట్టుదిట్టం చేసినట్టు వెల్లడి**

**ఇద్దరు ప్రయాణికులకు ఎబోలా నెగెటివ్ వచ్చిందన్న మంత్రి**



ప్రపంచాన్ని టెన్షన్ పెడుతున్న ఎబోలా వైరస్ నియంత్రణపై తెలంగాణ ప్రభుత్వం పూర్తి స్థాయిలో అప్రమత్తమైంది. రాష్ట్ర సచివాలయంలో వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో స్క్రీనింగ్, సర్విలెన్స్‌ను మరింత కట్టుదిట్టం చేసినట్లు ఆయన వెల్లడించారు. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై విమానాశ్రయం నుంచే 21 రోజుల పాటు కఠిన పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. విదేశీ ప్రయాణికులతో కమ్యూనికేషన్ సులువుగా ఉండేందుకు ఎయిర్‌పోర్ట్‌లో ఫ్రెంచ్, అరబిక్, స్వాహిలి భాషలు తెలిసిన సిబ్బందిని నియమించాలని మంత్రి సూచించారు. కాంటాక్ట్ ట్రేసింగ్ కోసం హెల్త్, పోలీస్, ఎయిర్‌పోర్ట్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. తప్పుడు సమాచారం లేదా తప్పుడు అడ్రస్‌లు ఇచ్చే ప్రయాణికులపై ఎపిడెమిక్ డిసీజెస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నమోదైన ఇద్దరు అనుమానితులకు ఎబోలా నెగెటివ్ వచ్చిందని, అయితే నిర్ధారణ కోసం మరోసారి నమూనాలను పరీక్షకు పంపామని మంత్రి తెలిపారు. అత్యవసర పరిస్థితుల కోసం గాంధీ ఆసుపత్రిలో ఐసోలేషన్ వార్డులను సిద్ధం చేశామన్నారు. సీసీఎంబీకి టెస్టింగ్ కిట్లు అందాయని, పరీక్షలు కూడా ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. కేంద్ర ఆరోగ్యశాఖ, ఐసీఎంఆర్ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని... కాబట్టి ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.




## సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కాలనీ వాసుల ధర్నా

నాచారం, జూన్ 8, వార్త మిర్రర్

నాచారం డివిజన్ భవాని నగర్ కాలనీలో పెండింగ్‌లో ఉన్న రోడ్డు మరియు డ్రైనేజ్ పనులను వెంటనే పూర్తి చేయాలని కాలనీ వాసులు రోడ్డుపై కూర్చొని అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ డౌన్ డౌన్ అంటూ నిరసన తెలుపుతూ ధర్నా నిర్వహించారు. భవాని నగర్ కాలనీ ప్రధాన రహదారిపై అసంపూర్తిగా వదిలేసిన అభివృద్ధి పనుల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో భవాని నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ప్రజలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాగిరి మోహన్ రెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి. డ్రైనేజ్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్న అధికారుల వైఖరి మారి భవాని నగర్ ప్రజలకు న్యాయం చేయాలని తెలిపారు. ప్రజల సమస్యలపై పోరాటం ఆగదు అని, పనులు పూర్తయ్యే వరకు ఉద్యమం కొనసాగుతుంది కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు సి. వినోద, సి. కృష్ణా రెడ్డి, బి హరినాథ్ రెడ్డి, ఆనంద కుమార్, అభిషేక్ గౌడ్, ఎస్ సురేందర్, రాయుడు, జే శ్రీధర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, పి సాంబశివరావ్, రాములు, తోట రమేష్, కాళిదాస్, గోల్డ్ రమేష్, జే శ్రీనివాస్, శేఖర్ రెడ్డి, వెంకటేష్, భాస్కర చారీ, బి మధుసూదన్ రెడ్డి, సత్యలక్ష్మి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్వరం బీజేపీ దళిత మోర్చా మండల కమిటీ ఎన్నిక దళిత మోర్చా మండల అధ్యక్షులుగా గోల్లూరు మాధవ్



వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో

మహేశ్వరం మండలంలో భారతీయ జనతా పార్టీ దళిత మోర్చా మండల కమిటీని బీజేపీ మండల అధ్యక్షులు తెల్లగామల యాదీష్ ఆదేశాల మేరకు, దళిత మోర్చా మండల అధ్యక్షుడు గోల్లూరు మాధవ్ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. నూతన కమిటీలో ఉపాధ్యక్షులుగా జనపల్లి రాజు, గజ్జల శ్రీనివాస్, బొమ్మనబోయి జంగయ్య, గట్లగొల్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా దాసరి సుదర్శన్, రంగుల రవి బాధ్యతలు స్వీకరించారు. కార్యదర్శులుగా ఎర్ర ప్రశాంత్, నత్తి జంగయ్య, బండి మోహన్‌రాజ్, తొంట శివలింగం ఎన్నికయ్యారు. కోశాధికారులుగా బండి ప్రవీణ్, జనపల్లి రమేష్ నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఏర్పుల ప్రశాంత్, కల్వకుల్ యాదగిరి, మంత్రి శ్రీకాంత్, కొండని సురేష్, మంద యాదగిరి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి మరియు దళిత వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. మహేశ్వరం మండలంలో పార్టీ కార్యక్రమాలను గ్రామ స్థాయి వరకు విస్తరించేలా నూతన కమిటీ పనిచేయాలని ఆకాంక్షించారు.



## శ్వాసకోశ వ్యాధులకు మృగశిర ఆయుర్వేద ఔషదం ఉచితంగా పంపిణి

వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి జూన్ 8

సోమవారం రోజున ఉదయం 9 గంటల నుండి శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయము, చింతకుంట చెరువు దగ్గర, సూర్య నగర్, జగిత్యాలలో మృగశిర కార్తి సందర్భంగా మిరుగు మందు, మృగశిర ఆయుర్వేద ఔషదం ఉచితంగా పంపింణి చేయడం జరిగినది. ఈ మందు గత 15 సంవత్సరాల నుండి ఉచితంగా అందజేయడం జరుగు చున్నది. ఔషదం సేవించిన వారికి శ్వాసకోశ వ్యాదులైన, జలుబు, దగ్గు, ఆస్తమా, ఇసినో పైలియా, మొదలైన అలర్జీ సంబంధించిన నయం చేస్తూ రోగ నిరోద నిరోధంకంగా ఉపయోపడుతుందని ఆయుర్వేద శాస్తం చెబుతుంది. ఈ ఔషదాన్ని దాదాపు 500 మంది వరకు సేవించారు. ఇట్టి కార్యక్రమంలో ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడింట్ వొడ్నాల శ్రీనివాస్, మేనిజంగ్ ట్రస్టీ గట్టు రాజేందర్, ప్రధాన కార్యదర్షి వడ్ల గట్ట శంకర్, సహ కార్యదర్షి భారతాల రాజసాగర్ తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడి కేంద్రాలలో పోషకాహార పంపిణీ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 8జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కట్కాపూర్ అంగన్వాడీ కేంద్రంలలో సోమవారం రోజున ప్రభుత్వ ఆదేశాల మేరకు వేసవి సెలవుల 15 జూన్ వరకు పొడిగించిన సందర్భంగా గర్భిణీ స్త్రీలకు బాలింతలకు ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలకు బరువులు ఎత్తులు తీసి తల్లులకు అవగాహన కలిగించి వారికి సరుకులు బియ్యము పప్పు, నూనె, గుడ్లు, పాలు, బాలామృతము, మురుకులు ఇంటికి ఇవ్వడము జరిగినది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అనూహ్య, అంగన్వాడి టీచర్లు ఈ సంధ్యారాణి, నాగరత్న, రాధా, గర్భవతులు, బాలింతలు తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**- మృతి చెందిన మిత్రులకు ఘన నివాళులర్పించిన పూర్వ విద్యార్థులు**




కల్వకుర్తి,జూన్ 8 వార్త మిర్రర్ ప్రతినిధి:- నాగర్ కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలం పరిధిలోని మాదారం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 2000-2001 సంవత్సరంలో పదవతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని శుభం ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించుకున్నారు. ఆనాడు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయుల సేవలను స్మరించుకున్నారు. 25,సంవత్సరాల తర్వాత ఒక చోటకలుసుకున్న స్నేహితులుతాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకుంటూ ఆనందం వ్యక్తంచేశారు. ఆ రోజుల్లో ఒక చోట చదువుకున్న నేడుఎక్కడెక్కడో స్థిరపడ్డ అందరు కలిసి మెలిసి ఒకరి కష్టసుఖాలను మరొకరు పంచుకుంటూ,నిజమైన పేదవారికితోచిన ఆర్థిక సాయం అందిస్తూ చేయూతనివ్వాలని పలువురు ఆకాంక్షించారు. చనిపోయిన మిత్రుల గుర్తింపులను స్మరించుకుంటూ,వారి ఆత్మలకు శాంతి కలగాలని మౌనంపాటించారు. ఈ కార్యక్రమంలో కుంబర్తి రామకృష్ణ,ఎండి ఖాజా మైనుద్దీన్, ప్రేమేందర్ రెడ్డి,రవీందర్ రెడ్డి,నరేందర్ గౌడ్, రమేష్ గౌడ్, బాలస్వామి,లాలయ్య గౌడ్,నాగార్జున,భాస్కర్, శ్రీనివాసులు,జి భాస్కర్,రహమత్ ఖాన్,అబ్దుల్ కాజా, కాజా,రమేష్,రాజేందర్ గౌడ్,చెన్నయ్య,నరసింహారెడ్డి, కొమ్ము శ్రీను, జగన్మోహన్ రెడ్డి,చంద్రమోహన్ రెడ్డి, గోవర్ధన్, రాఘవేందర్, కొండలయ్య, గోపాలకృష్ణ, మధుసూదన్ గౌడ్,శ్రీదేవి,భూదేవి,సరిత,పారిజాత, తస్లీమ్, సంతోష,రేణుక, మంజుల, రజిత, సునీత, పూర్వవిద్యార్థులుతదితరులుపాల్గొన్నారు.

# ఎకో ఫ్రెండ్లీ ఉత్పత్తులను ఉపయోగించాలి

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 8 గ్రామంలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించాలని జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఆలూరు సర్పంచ్ నల్లాల స్వామి కోరారు. మనం నిత్యం భోజనానికి వాడే ప్లాస్టిక్ ప్లేట్స్, గ్లాసులు వాడకం మానేసి ప్రకృతి ద్వారా దొరికే మోదుగ ఆకుల ద్వారా విస్తారాకులు ప్లేట్లుగా తయారు చేసుకొని వాడాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి రమ్య మాట్లాడుతూ ఇప్పుడు మోదుగ ఆకులు చిగురోచ్చే సమయం, లేత ఆకులను వాడి ప్లేట్స్ తయారు చేయండి. మీ అవసరానికి మించి తయారు చేసినట్లయితే వాటిని మార్కెటింగ్ మేము చేయిస్తామని హామీ ఇచ్చారు. విస్తారు ఆకుల ద్వారా ఉపాధి పొందాలని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ఉపాధి కోసం బీడీలు, పోగాకు చుట్టడం ఆరోగ్యానికి హానికరం అని సూచించారు. ఉపాధి హామీ పనుల పర్యవేక్షణలో భాగంగా కార్యదర్శి మాట్లాడుతూ తవ్వకం త్వరగా అయినవారు ఇక్కడ అడవిలో దొరికే ఆకులతో ప్లేట్స్ కుట్టడం ద్వారా కూడా ఆదాయం, ఆరోగ్యం పొందవచ్చన్నారు. రైతులు పంట పోలాలలో వ్యర్థాలని కాల్చి వాతావరణం కాలుష్యం చేయద్దు. తోటలోనే కలియ దున్ని భూసారం పెంచాలని రైతులనుద్దేశించి మాజీ సర్పంచ్ మెక్కొండ రాంరెడ్డి కోరారు...ఈ



కార్యక్రమం లో ఉపసర్పంచ్ చల్ల మహేష్, వార్డు సభ్యులు ఆకుల నర్సారెడ్డి, జీవరత్నం, జ్యోతి, స్వాతి, ఫీల్డ్ అసిస్టెంట్ గాజంగి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలి

**- జిల్లా కలెక్టర్‌కు టిడబ్ల్యూజేఎఫ్ వినతి**

వార్త మిర్రర్ మందమర్రి జూన్ 8: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య ఆదేశాల మేరకు సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్‌కు వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు మాట్లాడుతూ సమాజానికి సమాచారాన్ని చేరవేయడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పెరుగుతున్న విద్యా ఖర్చుల నేపథ్యంలో జర్నలిస్టుల పిల్లల ఉన్నత విద్య భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తున్నప్పటికీ, వారి పిల్లల విద్యకు ప్రత్యేక రాయితీలు కల్పించడం ద్వారా మరింత భరోసా కలిగించవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, వృత్తి విద్యా సంస్థల్లో ఫీజులు భారీగా పెరిగిన కారణంగా మధ్యతరగతి, తక్కువ ఆదాయం కలిగిన జర్నలిస్టు కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నారని, అలాంటి కుటుంబాలకు విద్యాపరమైన ప్రోత్సాహకాలు అందించడం సమాజం పట్ల ప్రభుత్వం చూపే గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో కనీసం 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని, అలాగే ఉన్నత విద్య, సాంకేతిక విద్య, వృత్తి విద్యా కోర్సుల్లో ప్రత్యేక కోటా మరియు స్కాలర్‌షిప్‌లు అమలు చేయాలని కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ఈ డిమాండ్‌ను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని కోరారు. జర్నలిస్టులు ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో,



అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో నిరంతరం సేవలందిస్తున్నారని, అలాంటి కుటుంబాలకు విద్యా రంగంలో రాయితీలు కల్పించడం ద్వారా వారి సేవలను ప్రభుత్వం గుర్తించినట్టవుతుందని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక విద్యా సహాయ పథకాలు రూపొందించి అమలు చేయాలని కూడా కోరారు. ఈ సందర్భంగా సమర్పించిన వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్ సమస్యను పరిశీలించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ చెన్నూర్ నియోజకవర్గ ఇంచార్జి మడ్డి వేణుగోపాల్ గౌడ్, దూడ సందీప్, వలస మణిరాజ్, ప్రవీణ్, సతీష్, రాజేష్, ప్రభాకర్, అమీన్, సుధీర్, రాజశేఖర్, జిల్లా, మండల నాయకులు, వర్కింగ్ జర్నలిస్టులు, పలువురు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# వార్డు సభ నిర్వహించిన కౌన్సిలర్లు

వార్తా మిర్రర్ మోత్కూర్ జూన్ 8 మోత్కూర్ మున్సిపల్ కౌన్సిల్ పదకొండు పన్నెండు వార్డు లలో వార్డు సభ నిర్వహించి రాబోయే వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిపిస్తూ కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న గౌడ్ మాట్లాడుతూ మన పరిసరాల్లో ఉండే పాత టైర్లు పాత గోళాలు పగిలిన కుండలు వంటి వాటిలలో నీరు నిల్వ కాకుండా చూసుకోవాలని వాటి వల్ల పిల్లలు పెద్దలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంటుందని టైఫాయిడ్ మలేరియా వంటి వ్యాధులు ప్రభులే అవకాశం ఉందని తెలియజేస్తూ మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే మనం ఆరోగ్యంగా ఉండగలుగుతామని తెలియజేశారు అదేవిధంగా వర్షాకాలం లో వరద నీరు వెళ్లకుండా డ్రైనేజీ వ్యవస్థ మూసుకుపోయిన కూలిపోయిన మున్సిపల్ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని కోరుతు వార్డులలో పలు సమస్యలపై మాట్లాడుతూ ప్రజల నుండి పలు సూచనలు తీసుకోవడం జరిగింది. విధి లైట్స్ , వాటర్ ప్రాబ్లమ్, మోరీల సమస్యలు, కోతుల బెడద ,దోమల నివారణ పద్నాలుగు నుండి ఇరవై సంవత్సరాల పిల్లలు గంజాయి డ్రగ్స్ బారిన పడకుండా తమ తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎవరైనా గంజాయి విక్రయిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని



సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని అట్టి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కారుపోతుల వెంకన్న గౌడ్, వెంట రమణ, కమిషనర్ గోల్కొండ నరసయ్య,ఎ ఎస్ ఐ వెంకన్న,వార్డ్ ఆఫీసర్లు రాచర్ల సంధ్యారాణి, కిరణ్ కుమార్, శ్రవణ్ కుమార్, పద్మ, యాదయ్య, ఆర్ పి లు ధనలక్ష్మి, సతీష్ పాల్గొన్నారు

# రైతులకు అండగా భారతీయ కిసాన్ సంఘ్..

**బికెఎస్ రాష్ట్ర పరిశీలకులు నానా అక్రే.**



వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి జూన్ 8

భారతీయ కిసాన్ సంఘ్ జగిత్యాల జిల్లా కార్యవర్గ సమావేశం మేడిపల్లి మండల కేంద్రంలోనీ పిఎన్నార్ గార్డెన్ లో నిర్వహించారు. జిల్లాలోని 20 మండలాల నుంచి బి కే ఎస్ మండల బాధ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర పరిశీలకులు నానా అక్రే హాజరై మాట్లాడారు. రైతాంగం ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు, అలాగే మార్కెటింగ్ సమస్యలపై మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర, పరిహారం కోసం బికేఎస్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. రైతులు పండించే పంటలను



మార్కెటింగ్ చేసే విధంగా తగు సూచనలు సలహాలు చేశారు. భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ స్థాయిలో రైతుల పక్షాన పోరాటం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ సెక్రటరీ అంభేరి ఆనంద్ రావు, ప్రాంత సంఘటన కార్యదర్శి మాది రెడ్డి రాజారెడ్డి, రాష్ట్ర సెక్రటరీ విజయ్ భాస్కర్, జోనల్ అధ్యక్షులు రావుల లింగారెడ్డి జిల్లా అధ్యక్షులు కాసారం భూమరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇప్ప రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షులు నోముల నరసింహా రెడ్డి, విద్యుత్ ప్రముఖ్ మిట్టపల్లి తిరుపతి రెడ్డి, ముద్దం గంగారెడ్డి, క్యాతం శంకర్ రెడ్డి, తిరుమల శంకర్, బుస మల్లేష్, చాల్ల సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి: కాశీ సతీష్ కుమార్



సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 8 : దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలకు షెడ్యూల్డ్ కుల హోదా, రిజర్వేషన్ ప్రయోజనాలు కల్పించాలని బహుజన రక్షణ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, దళిత క్రైస్తవ నాయకుడు కాశీ సతీష్ కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఢిల్లీలో జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ నేతృత్వంలోని దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలకు షెడ్యూల్డ్ కుల హోదా పరిశీలన కమిషన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మత మార్పిడి జరిగినప్పటికీ దళిత క్రైస్తవులు ఇప్పటికీ కుల వివక్ష, ఆర్థిక వెనుకబాటుతనం, విద్యా మరియు ఉపాధి అవకాశాల కొరతను ఎదుర్కొంటున్నారని తెలిపారు. 1950 రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఆర్డర్‌లోని మతపరమైన పరిమితుల కారణంగా దళిత క్రైస్తవులు ఎస్సీ హోదా, రిజర్వేషన్ ప్రయోజనాలను కోల్పోయారని పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని సమానత్వం, సామాజిక న్యాయం, మత స్వేచ్ఛ సూత్రాలకు అనుగుణంగా దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదాను పునరుద్ధరించాలని కోరారు. అలాగే బీసీ–సి రిజర్వేషన్ శాతాన్ని పెంచడంతో పాటు ప్రత్యేక రిజర్వేషన్ వర్గం లేదా ఎస్సీ–ఈ ఉపవర్గాన్ని ఏర్పాటు చేసి తగిన రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. దళిత క్రైస్తవులకు న్యాయం జరిగేలా కమిషన్ సానుకూల సిఫార్సులు చేయాలని కాశీ సతీష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.




## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### - పొన్నారం సర్పంచ్ పెంచాల మధు-

వార్త మిర్రర్ మందమర్రి జూన్ 8:

ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న కూలీలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పొన్నారం గ్రామ సర్పంచ్ పెంచాల మధు కోరారు. సోమవారం మండలం లోని పొన్నారం గ్రామం లోని ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలందరూ ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు విధులు నిర్వహించాలన్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు ఉపాధి హామీ పథకం సద్వినియోగం చేసుకొని కేంద్ర ప్రభుత్వం పథకాలలో లబ్ధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు సురిమిల్ల పద్మ, బోర్లకుంట లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి హరీష్, ఫీల్డ్ అసిస్టెంట్ ఈద లింగయ్య లు పాల్గొన్నారు.

## స్మృతి కాబోయేవాడితో ఉన్న ఈ అమ్మాయ్ ఎవరు.! పలాష్ ఇంత పెద్ద చీటరా.? వైరల్ ఫోటోలు



భారత స్టార్ మహిళా క్రికెటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్ వివాహం వాయిదా పడింది. పెళ్లి వేడుకల్లో పాల్గొంటుండగా మంధాన తండ్రి గుండెపోటు లక్షణాలతో ఇబ్బందిపడ్డారు. దీంతో ఆయన్ను వెంటనే సాంగ్లీలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే ఇప్పుడు కొత్త ట్విస్ట్ బయటపడింది. భారత స్టార్ మహిళా క్రికెటర్ స్మృతి మంధాన, మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్ వివాహం వాయిదా పడింది. పెళ్లి వేడుకల్లో పాల్గొంటుండగా మంధాన తండ్రి గుండెపోటు లక్షణాలతో ఇబ్బందిపడ్డారు. దీంతో ఆయన్ను వెంటనే సాంగ్లీలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో పెళ్లిని వాయిదా వేసుకున్నారు స్మృతి మంధాన. పెళ్లి కొడుకు తరపున వారు చెప్పినా ఆమె తండ్రి ఆరోగ్యమే ముఖ్యమని చెప్పడంతో.. పెళ్లి ఆగిపోయింది. అయితే అదేరోజు రాత్రి పలాశ్ ముచ్చల్ కూడా అనారోగ్యానికి గురవడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. వైరల్ ఇన్ఫెక్షన్, అసిడిటీ వల్ల అతడు ఇబ్బంది పడ్డాడని వైద్యులు వెల్లడించారు. చికిత్స అనంతరం పలాశ్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. అయితే ఈ విషయానికి సంబంధించి పలాశ్ సోదరి పలాక్ ముచ్చల్ ఇన్‌స్టా వేదికగా స్టోరీ షేర్ చేశారు. ‘స్మృతి మంధాన నాన్నగారికి అనారోగ్యం కారణంగా, మంధాన, పలాశ్ వివాహం ప్రస్తుతానికి ఆగిపోయింది. ఈ సమయంలో అందరూ ఇరు కుటుంబాల ప్రైవసీని గౌరవించాలని కోరుతున్నానంటూ పోస్ట్ చేశారు.

## ఐపీఎల్ తన్ని తరిమేసింది.. కట్ చేస్తే.. 9 ఫోర్లు, 5 సిక్సర్లతో బౌలర్ల నడ్డి విరిచాడు.. ఎవరీ ప్లేయర్.?




ఐపీఎల్ తన్ని తరిమేసింది.. కానీ విదేశీ టోర్నీలలో మాత్రం తన సత్తా చాటాడు. ఇది అటుంచితే కెప్టెన్ గా మాత్రం విఫలమయ్యాడు. ఆడిన 4 మ్యాచ్ లలోనూ ఓటమిపాలై.. పేలవ ప్రదర్శన కనబరిచింది. మరి ఆ స్టోరీ ఏంటో ఇప్పుడు తెలుసుకుందామా. ఓ సారి లుక్కేయండి. ఐపీఎల్ తన్ని తరిమేసింది.. కట్ చేస్తే.. 9 ఫోర్లు, 5 సిక్సర్లతో బౌలర్ల నడ్డి విరిచాడు.. ఎవరీ ప్లేయర్.? ప్రపంచంలోనే రిచ్చెస్ట్ క్రికెట్ లీగ్ అంటేనే ఠక్కున మైండ్‌లోకి వచ్చేది ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్). ఈ లీగ్‌లో ఆడాలని ప్రతీ విదేశీ ప్లేయర్ ఉవ్విళ్ళూరుతుంటారు.

## పెట్రోల్, డీజిల్, ధరల పెంపు తో ప్రజలపై పెను భారం మోపుతున్న మోడీ సర్కార్.

### సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జాంగిర్ డిమాండ్




వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూన్ 08

దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో దేశ ప్రజల పెనుబారం మోపుతున్న మోడీ సర్కార్ అని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జాంగిర్ అన్నారు. సోమవారం రోజున చౌటుప్పల మండల జనరల్ బాడీ సమావేశం నీకి అధ్యక్షత వహించిన మండల కార్యదర్శి వర్గ సభ్యులు చిరిక సంజీవరెడ్డి మండల జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా జాంగిర్ గారు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తికాగానే డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను పెంచి ప్రజల ను మరోసారి మోసం చేసిందని అన్నారు. డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరల పెరుగుదల వల్ల అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం చూపుతుందని అన్నారు. నిత్యవసర ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్–ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్, గ్యాస్ రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమే అని విరుచుకుపడ్డారు. ఎన్నికల ముందు బిజెపి ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచం అని పదే పదే ప్రకటించినది అని గుర్తు చేశారు. ఫలితాలు వచ్చిన నెల రోజులలో ఇప్పటికీ మూడు దఫాలుగా పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమే అని అన్నారు. కేవలం ఓట్ల కోసం ఎన్నికల కోసం మోడీ అబద్ధాలు చెబుతున్నారని ప్రజలు భావిస్తున్నారని, ఇది విశ్వాస ఘాతకం, అవుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూర్గు కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు రాగిరికిష్టయ్య, గడ్డం వెంకటేశం, మండల నాయకులు బోయ యాదయ్య, పొట్ట శ్రీనివాసు, బోధస్ వెంకటేశం, కొండే శ్రీశైలం, కొంతం సుశీల, చెరుకు లక్ష్మమ్మ, చీరిక అలివేలు, పగిళ్ల శశిరేఖ, యాట బాలరాజు, శాఖ కార్యదర్శిలు రత్నం శ్రీకాంత్, కొంతం శ్రీనివాస్ రెడ్డి, నేరేడు మహేష్, జక్కిడి రమణారెడ్డి, మానే సాలయ్య, పల్లె సత్యం, బోదాస్ స్వాతి, ఉప సర్పంచ్ వార్డు మెంబర్ పాలమాకుల పుష్ప, నక్క జయసుధ, జంగం వెంకటమ్మ, సంజీవ రమేష్, పార్టీ నాయకులు యాట ముత్యాలు రమేష్, జంగం అంజయ్య, ఫకీర్ పెంటారెడ్డి, చెరుకు అంజయ్య, ఎస్.కె మదర్ వెంకటేశం, పాల్గొనడం జరిగింది.

## కలెక్టరేట్ ముందు ధర్నా కార్యక్రమం జయప్రదం చేయండి.

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి.



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూన్ 08

బిజెపి పాలనలో సామాన్యుడు బతుకు భారంగా మారిందని, వంటగ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి అన్నారు. అధిక ధరలలో పెరుగుదలను నిరసిస్తూ ఈనెల 10 న కలెక్టరేట్ ముందు నిర్వహించే ధర్నా కార్యక్రమం కరపత్రాలను చౌటుప్పల్ సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్చేదిన్ వస్తాయని చెప్పి సామాన్య మధ్యతరగతి కుటుంబాల జేబులకు చిల్లులు పెడుతున్నారని, కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయలు పన్ను రైతులు ఇస్తున్న బిజెపి ప్రభుత్వం, సామాన్యులపై మాత్రం పన్నుల భారం వేస్తూ ధరల నియంత్రణలో పూర్తిగా విఫలమైందని, సామాన్య మధ్యతరగతి కుటుంబాల ఆదాయాల్లో పురోగతి లేదు కానీ ఖర్చులు మాత్రం విపరీతంగా రెట్టింపవుతున్నాయని, దేశంలో పేదరికం నిరుద్యోగం పెరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినటువంటి వ్యవహరిస్తుందని, ఎన్నికల సమయంలో ఎలాంటి ధరలు పెంచకుండా, ఎన్నికలు ముగియగానే నెలలో మూడుసార్లు పెట్రోల్ డీజిల్ గ్యాస్ రేట్లు పెంచడం దేశ ప్రజల్ని మోసం చేయడమె అని అన్నారు. ధరల పెరుగుదల పరిస్థితులను ఆసరా చేసుకుని బ్లాక్ మార్కెట్ చేస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నటువంటి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పగిల్ల మోహన్ రెడ్డి, ఏఐటీయూసీ పిల్లి శంకర్, ఏ ఎస్ ఎఫ్ ఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరి వెంకటేష్, టంగుటూరు రాములు, దాసరి అంజయ్య, బద్దుల సుధాకర్, దాసరి యాదయ్య, ఉబ్బు సుదర్శన్, డి కృష్ణ, శంకర్ బాబు, డి మనోహర్, చింటు తదితరులు పాల్గొన్నారు..

## దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

### -వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ-



వార్త మిర్రర్ మందమర్రి జూన్ 8:

పట్టణంలోని అర్హులైన దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగుకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులకు ఆసరా పెన్షన్ దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ మంజూరు చేయాలన్నారు. వికలాంగులకు 6000, వృద్ధులు, వితంతువులు ఒంటరి మహిళలు ఇతర ఆసరా పెన్షన్ దారులకీదరికీ 4000 పెన్షన్ వెంటనే అమలు చేయాలన్నారు. అర్హులైన వికలాంగులకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి పట్టణ అధ్యక్షుడు రామ శ్రీనివాస్, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు రామటెంకి దుర్గారాజ్, బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్, చెన్నూర్ నియోజకవర్గం అధ్యక్షులు గాజుల శంకర్, బెల్లంపల్లి నియోజకవర్గం ఇంచార్జి గోమాస బ్రహ్మానందం, మండల అధ్యక్షులు రహీం బాబా అంబేద్కర్ సంఘం నాయకులు డబ్బ్యా సురేందర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు బై రాజు శ్రీనివాస్, బైరాజ్ సురేందర్ పాల్గొన్నారు.

## పెళ్లిని వాయిదా వేసింది స్మృతి మంధాన కాదంట.. ఎవరో తెలుసా?



టీం ఇండియా స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన వివాహం తన తండ్రి అనారోగ్యం కారణంగా వాయిదా పడిన సంగతి తెలిసిందే. వివాహం రద్దు అయిన తర్వాత, కాబోయే భర్త పలాష్ ముచ్చల్ తల్లి ఒక కీలక విషయాన్ని వెల్లడించింది. స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన, సంగీతకారుడు పలాష్ ముచ్చల్ వివాహం వాయిదా పడినప్పటి నుంచి కొత్త విషయాలు వెల్లడవుతున్నాయి. సోషల్ మీడియాలో కూడా అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మొదట్లో, స్మృతి మంధాన తండ్రి ఆరోగ్యం పెళ్లి రోజున క్షీణించిందని, ఆయనకు గుండెపోటు వచ్చిందని, ఆ తర్వాత ఆయన ఆసుపత్రిలో చేరారని వార్తలు వచ్చాయి. ఆ తర్వాత, తన తండ్రి ఆరోగ్యం కారణంగా స్మృతి మంధాన వివాహాన్ని వాయిదా వేయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడైంది. ఇప్పుడు, ఈ కథలో కొత్త మలుపు వచ్చింది. సంగీతకారుడు పలాష్ ముచ్చల్ తల్లి వివాహాన్ని వాయిదా వేసింది స్మృతి కాదని, తన కొడుకు అని వెల్లడించి షాకిచ్చింది. దీని వెనుక ఉన్న ప్రధాన కారణాన్ని ఆమె వివరించింది. పలాష్ తల్లి కూడా పలాష్ స్మృతి కంటే క్రికెటర్ తండ్రికి దగ్గరగా ఉండేవాడని పేర్కొంది. పెళ్లి వాయిదా వేసింది పలాష్, స్మృతి కాదు..ఒక ఇంటర్వ్యూలో, పలాష్ తల్లి అమిత ముచ్చల్, తన కొడుకు, స్మృతి తండ్రి చాలా సన్నిహితంగా ఉండేవారని వివరించింది. అందువల్ల, స్మృతి తండ్రిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకెళ్లిన వెంటనే, పలాష్ వివాహ ఆచారాలు, ఇతర ఆచారాలను ఆపాలని నిర్ణయించుకున్నాడని తెలిపింది. ఇవి కూడా చదవండిపలాష్ తల్లి మాట్లాడుతూ, “పలాష్ మామ (స్మృతి తండ్రి) తో చాలా అనుబంధం కలిగి ఉన్నాడు. స్మృతి కంటే చాలా క్లోజ్ గా ఉండేవాడు. అతని ఆరోగ్యం క్షీణించినప్పుడు, మామ కోలుకునే వరకు పెళ్లిని వాయిదా వేయాలని పలాష్ స్మృతి కంటే ముందే నిర్ణయించుకున్నాడు” అంటూ తెలిపింది. పలాష్ సోదరి ఏమి చెప్పిందంటే? స్మృతి మంధానతో తన సోదరుడి వివాహం వాయిదా పడిన తర్వాత, ప్రముఖ గాయని పాలక్ ముచ్చల్ తన మౌనాన్ని వీడి ఇన్‌స్టాగ్రామ్‌లో పూర్తి నిజాన్ని పంచుకుంది. స్మృతి తండ్రి అనారోగ్యం కారణంగా, స్మృతి, పలాష్ వివాహం వాయిదా పడినట్లు చెప్పుకొచ్చింది. ఈ సున్నితమైన సమయంలో ప్రతి ఒక్కరూ కుటుంబాల గోప్యతను గౌరవించాలని మేము అభ్యర్థిస్తున్నాం అంటూ రాసుకొచ్చింది.” ఎళ్లిని వాయిదా వేసింది స్మృతి మంధాన కాదంట.. ఎవరో తెలుసా? స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన, సంగీతకారుడు పలాష్ ముచ్చల్ వివాహం వాయిదా పడినప్పటి నుంచి కొత్త విషయాలు వెల్లడవుతున్నాయి.

సోషల్ మీడియాలో కూడా అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మొదట్లో, స్మృతి మంధాన తండ్రి ఆరోగ్యం పెళ్లి రోజున క్షీణించిందని, ఆయనకు గుండెపోటు వచ్చిందని, ఆ తర్వాత ఆయన ఆసుపత్రిలో చేరారని వార్తలు వచ్చాయి. ఆ తర్వాత, తన తండ్రి ఆరోగ్యం కారణంగా స్మృతి మంధాన వివాహాన్ని వాయిదా వేయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడైంది. ఇప్పుడు, ఈ కథలో కొత్త మలుపు వచ్చింది. సంగీతకారుడు పలాష్ ముచ్చల్ తల్లి వివాహాన్ని వాయిదా వేసింది స్మృతి కాదని, తన కొడుకు అని వెల్లడించి షాకిచ్చింది. దీని వెనుక ఉన్న ప్రధాన కారణాన్ని ఆమె వివరించింది. పలాష్ తల్లి కూడా పలాష్ స్మృతి కంటే క్రికెటర్ తండ్రికి దగ్గరగా ఉండేవాడని పేర్కొంది. పెళ్లి వాయిదా వేసింది పలాష్, స్మృతి కాదు..ఒక ఇంటర్వ్యూలో, పలాష్ తల్లి అమిత ముచ్చల్, తన కొడుకు, స్మృతి తండ్రి చాలా సన్నిహితంగా ఉండేవారని వివరించింది. అందువల్ల, స్మృతి తండ్రిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకెళ్లిన వెంటనే, పలాష్ వివాహ ఆచారాలు, ఇతర ఆచారాలను ఆపాలని నిర్ణయించుకున్నాడని తెలిపింది. ఏకంగా 89 మంది ప్లేయర్లకు ఇచ్చిపడేసిన వైభవ్ సూర్యవంశీ.. అదేంటంటే.? పలాష్ తల్లి మాట్లాడుతూ, “పలాష్ మామ (స్మృతి తండ్రి) తో చాలా అనుబంధం కలిగి ఉన్నాడు. స్మృతి కంటే చాలా క్లోజ్ గా ఉండేవాడు. అతని ఆరోగ్యం క్షీణించినప్పుడు, మామ కోలుకునే వరకు పెళ్లిని వాయిదా వేయాలని పలాష్ స్మృతి కంటే ముందే నిర్ణయించుకున్నాడు” అంటూ తెలిపింది. పలాష్ సోదరి ఏమి చెప్పిందంటే? స్మృతి మంధానతో తన సోదరుడి వివాహం వాయిదా పడిన తర్వాత, ప్రముఖ గాయని పాలక్ ముచ్చల్ తన మౌనాన్ని వీడి ఇన్‌స్టాగ్రామ్‌లో పూర్తి నిజాన్ని పంచుకుంది. స్మృతి తండ్రి అనారోగ్యం కారణంగా, స్మృతి, పలాష్ వివాహం వాయిదా పడినట్లు చెప్పుకొచ్చింది. ఈ సున్నితమైన సమయంలో ప్రతి ఒక్కరూ కుటుంబాల గోప్యతను గౌరవించాలని మేము అభ్యర్థిస్తున్నాం అంటూ రాసుకొచ్చింది.